# ఏయూ హాస్టల్ విద్యార్థినుల ఆందోళన ఉద్రిక్తం

**బిల్లుల మోత, నాసిరకం భోజనం, వసతుల కొరతపై రెండో రోజూ నిరసన...రిజిస్ట్రార్ జోక్యంతో విరమణ**



**విశాఖపట్నం, జూలై 22 (ఆన్‌లైన్):** భారీగా బిల్లులు, నాణ్యత లేని భోజనం...ఆపై వసతుల కొరతపై ఆంధ్ర విశ్వవిద్యాలయ హాస్టల్ విద్యార్థినులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. రిజిస్ట్రార్ ఆచార్య ప్రసాదరెడ్డి హామీతో బుధవారం అర్ధరాత్రి తర్వాత ఆందోళన విరమించిన విద్యార్థినులు గురువారం ఉదయం మరోసారి తమ సమస్యలపై గళం విప్పారు. నాణ్యమైన భోజనం లేకపోయినా బిల్లులు తడిసిమోపెడవుతున్నాయని ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తే వేధిస్తున్నారంటూ చీఫ్ వార్డెన్ తీరుపై ధ్వజమెత్తారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ మహారాణిపేటలోని హాస్టల్ ప్రాంగణంలో సుమారు ఐదు గంటల పాటు విద్యార్థినుల చేపట్టిన ఆందోళన రిజిస్ట్రార్ జోక్యంతో విరమించారు. హాస్టల్ సమస్యలపై విచారించడానికి ప్రత్యేకంగా కమిటీ వేయనున్నట్టు రిజిస్ట్రార్ ప్రకటించారు. వివరాల్లోకి వెళితే...

ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి హాస్టల్‌లో ప్రవేశం పేరిట వేలల్లో ఫీజులు వసూలు చేసిన హాస్టల్ యాజమాన్యం నాణ్యమైన భోజనం పెట్టడం లేదంటూ విద్యార్థినులు బుధవారం రాత్రి నుంచి ఆందోళన చేపట్టారు. సుమారు ఐదారు గంటల పాటు చేపట్టిన ఆందోళన చివరకు రిజిస్ట్రార్ హామీతో విరమించారు. అయితే గురువారం ఉదయం టిఫిన్స్ చేయకుండా విద్యార్థినులు మరోసారి హాస్టల్ ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ఉపకార వేతనాల విషయంలో స్పష్టమైన సమాధానం లేదని, రుచికరమైన భోజనం ఎందుకు పెట్టడం లేదంటూ నిరసనకు దిగారు. దీంతో చీఫ్ వార్డెన్ డాక్టర్ బి.రత్నకుమారి ఉపకులపతి ఆచార్య బీల సత్యనారాయణకు సమాచారం ఇవ్వడంతో ఆయన హాస్టల్‌కు వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు.

ఉపకార వేతనాలు రాలేదని, వేసవి తర్వాత హాస్టల్‌కు వస్తే మూడు నుంచి ఆరు వేల వరకు అడ్వాన్స్‌లు కట్టించుకున్నారని ఆరోపించారు. దీనిపై చీఫ్ వార్డెన్, సిబ్బంది సరైన సమాధానం చెప్పలేడం లేదంటూ వీసీకి ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల నుంచి వివరాలు తెలుసుకున్న ఆయన సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఉప కులపతుల సమావేశానికి హాజరు కానున్నందున రిజిస్ట్రార్ వస్తారని చెప్పి, వీసీ సత్యనారాయణ వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్ది సేపటికి రిజిస్ట్రార్ పీవీజీడీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.కె.మోహనరావు, స్టూడెంట్ డీన్ ఆచార్య నిమ్మ వెంకటరావులు హాస్టల్‌కు వచ్చారు. వీరిద్దరూ రావడంతో విద్యార్థినులు నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. వీరి నుంచి మరోసారి సమస్యలను విన్న రిజిస్ట్రార్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇందుకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మోహనావు నేతృత్వంలో కమిటీ వేయనున్నట్టు చెప్పారు. ఏడాది గడిచినా ఉపకార వేతనాలు మంజూరు కాలేదని, దీనిపై హాస్టల్ యాజమాన్యాన్ని అడిగితే సరైన సమాధానం లేదంటూ విద్యార్థినులు వాపోయారు. వేసవి తర్వాత వచ్చిన తమకు అడ్వాన్స్‌లు చెల్లించకపోతే హాస్టల్‌లోకి ప్రవేశం లేదని తెగేసి చెప్పారని, పల్లెల్లో వ్యవసాయం చేసుకునే తల్లిదండ్రులు ఎలా అంత సొమ్ము ఎలా కట్టగలరని ప్రశ్నించారు. అయినా పీజీ పూర్తిచేయాలనే లక్ష్యంతో అడ్వాన్స్‌లు చెల్లించామని, ఇంత చేసినా మెస్‌లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. మెస్ బిల్లుల విషయంలో పూర్తి వివరాలు చెప్పాలన్నా సమాధానం లేదన్నారు. ఈ సందర్భంగా చీఫ్ వార్డెన్ తీరు పట్ల విద్యార్థినులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థినుల ఆవేదనను ఆసాంతం విన్న రిజిస్ట్రార్, సమస్యలపై కమిటీ వేయనున్నట్టు వెల్లడించారు. హాస్టల్‌లో సమస్యలున్న మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. హాస్టల్‌లో 1,250 మంది వుండడంతో కొన్ని ఇబ్బందులున్నాయని పేర్కొంటూ మరో హాస్టల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపకార వేతనాల మంజూరుపై సంబంధిత అధికారులతో చర్చిస్తానన్నారు.



మెస్ సిబ్బందితో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రసాదరెడ్డి

## అధికారులపై రిజిస్ట్రార్ ఆగ్రహం

హాస్టల్‌లో మెస్‌ల నిర్వహణ, పరిపాలనపై రిజిస్ట్రార్ ప్రసాదరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల జారీలో వివరాలు లేకపోవడంపై చీఫ్ వార్డెన్ రత్నకుమారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్లుల తయారీ, మెస్‌ల నిర్వహణపై గతంలో చేసిన సూచనలను ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. పాలనలో పారదర్శకత లేనందునే సమస్యలు వస్తున్నాయని, ప్రతి పైసాకు లెక్కలు చెప్పాల్సిన బాధ్యత యాజమాన్యంపై వుందని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్‌తో పాటు వచ్చిన ప్రిన్సిపాల్ ఎల్‌కే మోహనరావు హాస్టల్ రికార్డులను పరిశీలించారు. అనంతరం వీరిద్దరూ మెస్‌లను పరిశీలించి, వీటి నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మెస్‌లలో పనిచేసే సిబ్బంది తీరు మార్చుకోవాలంటూ హెచ్చరించారు. 45 ఏళ్ల వయస్సు దాటిన వారినే మెస్‌లలో పనికి పెట్టుకోవాలని చీఫ్ వార్డెన్‌ను ఆదేశించారు. భోజనం విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే విద్యార్థినుల నుంచి ఇబ్బందులు వస్తాయని స్పష్టంచేశారు.



చీఫ్ వార్డెన్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న రిజిస్ట్రార్

## చీఫ్ వార్డెన్‌పై విద్యార్థినుల ధ్వజం

చీఫ్ వార్డెన్ రత్నకుమారిపై విద్యార్థినులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హాస్టల్‌లో కొందరు సిబ్బంది పనితీరు ఘోరంగా వుందని, ఈ విషయాన్ని ఎప్పుడైనా చెప్పాలని ప్రయత్నిస్తే చీఫ్ వార్డెన్ అందుబాటులో వుండరని ఆరోపించారు. హాస్టల్‌లో ఫంక్షన్లు, ఉన్నతాధికారుల పర్యటన సమయంలోనే ఆమె కనిపిస్తారని వ్యాఖ్యానించారు. తాము ఉదయం తరగతులకు వెళ్లిన తర్వాత ఆమె వచ్చి, మళ్లీ మధ్యాహ్నం తామొచ్చేసరికి వెళిపోవడం జరుగుతుందని వాపోయారు.

ఏదైనా సమస్య చెప్పాలని క్యాంపస్‌లో ఆమె విభాగానికి వెళితే...చూస్తాం...పరిశీలిస్తాం...అంటారే తప్ప తమ కష్టసుఖాలు తెలుసుకునే ప్రయత్నం చేయరని విద్యార్థినులు ధ్వజమెత్తారు. అంతేకాకుండా హాస్టల్‌లో క్రిస్మస్ పండుగ చేసే చీఫ్ వార్డెన్ ఇతర పండుగుల విషయాన్ని పట్టించుకోరని పలువురు ఆరోపించారు. హాస్టల్‌లో చేపట్టే ప్రతి ఉత్సవానికి ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 వసూలు చేస్తారన్నారు. చీఫ్ వార్డెన్‌కు పలువురు విద్యార్థినులు వత్తాసు పలుకుతున్నారని మరికొందరు ఆరోపించడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు.



విద్యార్థినుల మొర ఆలకిస్తున్న రిజిస్ట్రార్ ప్రసాదరెడ్డి

## రికార్డులను పరిశీలించిన కమిటీ

హాస్టల్ సమస్యలపై ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎల్‌కే మోహనరావు నేతృత్వంలో నలుగురు సీనియర్ ఆచార్యులతో కమిటీ ఏర్పాటైంది. ఆచార్య ఎ.నరసింహారావు (కామర్స్), రొక్కం సుదర్శనరావు (ఎకనామిక్స్), వీర్రాజు (ఫిలాసఫీ), పాల్ (ఆంత్రోపాలజీ)ల కమిటీ గురువారం సాయంత్రమే హాస్టల్‌కు వెళ్లి రికార్డులను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణ, పనితీరు, బిల్లులు వగైరా వివరాలపై విచారించి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## చీఫ్ వార్డెన్ మార్పుపై కసరత్తు

మహిళా హాస్టల్ చీఫ్ వార్డెన్ రత్నకుమారిని తప్పించాలని వర్సిటీ పాలకులు కొద్దిరోజుల నుంచి యోచిస్తున్నట్టు తెలిసింది. వుమెన్ స్టడీ సెంటర్ డైరెక్టర్ పదవి నుంచి ఆమెను తప్పించిన పాలకులు ఆ తర్వాత చీఫ్ వార్డెన్ బాధ్యతలను తప్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మహిళా హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా 2006లో నియమితులైన రత్నకుమారి పదవీ కాలం ముగిసింది.

చీఫ్ వార్డెన్ నిర్వహణకు సీనియర్ మహిళా ఆచార్యులెవరూ పెద్దగా ఆసక్తి చూపనందునే రత్నకుమారిని కొనసాగిస్తున్నారు. ప్రస్తుత సంఘటన నేపథ్యంలో రత్నకుమారిని తప్పించి ఆ పదవిలో మరో మహిళా ఆచార్యురాలిని నియమించేందుకు ఉన్నతాధికారులు తాజాగా నిర్ణయించినట్టు తెలిసింది.

# సమస్యలతో సా(అ)వాసం





**1,250 మంది విద్యార్థినులతో కిక్కిరిసిన హాస్టల్**

**ఒక్కో గదిలో ఆరు నుంచి ఏడుగురు..**

**నాసిరకం భోజనం, నీళ్ల సాంబారే దిక్కు**

**మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలతో సతమతం**

**మ**హారాణిపేటలో వున్న మహిళా హాస్టల్ పరిమితికి మించి విద్యార్థినులతో కిక్కిరిసిపోయింది. 650 మందికి పరిమితమయ్యేలా వసతి వుండగా, ప్రస్తుతం 1,250 మంది విద్యార్థినులు ఇందులో వుంటున్నారు. సాధారణంగా 800 మంది వరకు అయితే పర్వాలేదని అనుకున్నా... ఏటా పెరుగుతున్న విద్యార్థినులకు ఇక్కడే వసతి కల్పించాల్సి వస్తుంది. కొన్నేళ్లగా 'వర్సిటీ పాలకులు దీనిపై మల్లగుల్లాలు పడుతున్నా...ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగలేదు. ఈ ఏడాది మరో 200 మంది అదనంగా హాస్టల్‌లో ప్రవేశం కోసం వేచిచూస్తున్నారు. విద్యార్థినులకు వసతి కల్పించేందుకు మూడు హాస్టళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా, ఒక్కదానికే ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది.

కాగా పరిమితికి మించి విద్యార్థినులు ఉన్నట్టుగానే హాస్టల్‌లో సమస్యలు ఎక్కువగానే వున్నాయి. ఉదయం తరగతులకు వెళ్లడానికి బయలుదేరే విద్యార్థినులకు సరిపడ మరుగుదొడ్లు, మంచినీటి కొరతతో సతమతమవుతున్నారు. అంతేకాకుండా మెస్‌లో భోజనం ఇబ్బందులు వుండనే వున్నాయి. అన్నం గట్టిగా వుంటుందని విద్యార్థినులు ఆరోపించడం వాస్తవమేనని నిర్వాహకులే అంగీకరించారు. సూపర్‌బజార్ నుంచి వస్తున్న బియ్యంలో నాణ్యత లోపించిందని పేర్కొన్నారు. సాంబారు నీళ్లలా వుంటుందని, ఉదయం ఇచ్చే పాలు (విద్యార్థినులైతే పాలును వాటర్ మిల్క్‌గా పిలుస్తారు) కూడా నీళ్లలా వుంటాయని వారంతా ఆరోపించారు.



విద్యార్థినులు టిఫిన్‌కు రాక వెలవెలబోతున్న మెస్



గురువారం హాస్టల్లో తయారుచేసిన రుచి లేని ఉప్మా

ఎక్కువ రోజులు ఆనపకాయ, అరటికాయ కూరలే పెడతారు. గురువారం తయారుచేసిన ఉప్మా పేస్టులా వుందంటూ విద్యార్థినులు అక్కడకు వచ్చిన మీడియాకు చూపించారు. అప్పుడప్పుడు వండే బిర్యానీ వుడకదని, కొందరు బయటకు వెళ్లి టిఫిన్స్ చేస్తుంటామని పేర్కొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు చివరగా వచ్చేవారికి కూరలు, పెరుగు వుండవని, ఇవన్నీ తమకు అలవాటేనని విద్యార్థినులు వాపోయారు. దీనిపై ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామని చెబుతారే తప్ప పరిష్కారం వుండదని రిజిస్ట్రార్‌కే ఫిర్యాదు చేశారు. భోజనం చేసే విద్యార్థినులు సగం మంది ఎప్పుడూ కడుపునొప్పితో వుంటారని పలువురు ఆవేదనగా చెప్పారు. తమకు సరిపడినన్ని బస్సులు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థినులు వాపోయారు.

...ఆన్‌లైన్/విశాఖపట్నం